

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 23 మార్చి 2024



అభివృద్ధికి దూరంగా
నాంపల్లి గుట్ట
- భక్తులకు సౌకర్యాలు కరువు
ఎన్నికలు ప్రశాంతంగా
నిర్వహించాలి
8





వలసల జోరు

- షాకిస్తున్న గులాబీలు
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు
- సిరిసిల్ల బల్దియాలో ఖాళీ అవుతున్న కౌన్సిలర్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అధికారం మారిపోవడంతో బీఆర్ఎస్ నేతల్లో నిరుత్సాహం ఆవరించింది. గులాబీలు కొందరు పార్టీకి దూరం ఉండగా మరికొందరు కండువాలు మారుస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీవైపు చూస్తున్నారు. ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు పెరిగాయి. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'గేట్లు తెరిచామం' అని ప్రకటించడంతో చేరికల్లో ఊపందుకుంది. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికల పరంపర కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికలు నాలుగు విడతల్లో ఉండడంతో చేరికలు మరింత పెరగనున్నాయి.

బీఆర్ఎస్‌కు గడ్డుకాలం

లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్‌ల నుంచి భారీగా మేజార్టీ ఇవ్వాలని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు భావిస్తున్నా క్షేత్ర స్థాయి నాయకుల్లో పట్టుదల వీడినట్లుగా కనిపిస్తోంది. సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో అనుకున్న స్థాయిలో బీఆర్ఎస్‌కు ఓట్లు రాకపోవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు పూర్తవగా కాంగ్రెస్ అభ్యర్థిపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటి వరకు ప్రకటించిన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల్లో బీజేపీ వైపే సిరిసిల్ల, వేములవాడ నిలుస్తుందని భావిస్తున్నారు. యువతలో మోదీ హవా కొనసాగుతోంది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు 70,482 ఓట్లు, బీజేపీకి 64,769 ఓట్లు, కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు, వేములవాడ సెగ్మెంట్ నుంచి బీజేపీకి 73,290 ఓట్లు, బీఆర్ఎస్‌కు 47,399 ఓట్లు, కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు లభించాయి. ఈ సారి బీజేపీ ఓటు బ్యాంక్ పెరుగుతుందని భావిస్తున్నా వేములవాడలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉండడంతో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంక్ వస్తుందని భావిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఉత్సాహంగా ఉన్నా బీఆర్ఎస్‌ను నేతలు వీడుతుండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు మొదలయ్యాయి. జిల్లాలో ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరికలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలోనే మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, సీనియర్ నాయకుడు గాంధీబాబు, బీజేపీ నుంచి కనమేని చక్రధర్‌రెడ్డి చేరగా ఎన్నికల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే వలసలు పెరిగాయి. గంభీరావుపేట మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎల్లారెడ్డిపేట బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీటీసీలు నేవూరి రవీందర్‌రెడ్డి, ఒగ్గు బాలరాజుయాదవ్, పొన్నం బాలకిషన్, మాజీ సర్పంచులు మందాడి దేవేందర్‌యాదవ్, పొన్నాల మంజుల మల్లారెడ్డి, గొల్లపల్లి మల్లేశం, తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, బీజేపీ ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు అనిల్, బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ముస్తాబాద్ మండలం నుంచి కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మాజీ సర్పంచులు కిషన్‌రావు, కళ్యాణి, యారటి లక్ష్మీ, రేసు లక్ష్మీ, భూక్య దేవేందర్, శ్రీనివాస్, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ యాదగిరి గౌడ్, మాజీ ఎంపీపీ లక్ష్మీ కిషన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు చేరారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నుంచి దుబ్బాక స్వేచ్ఛరాజు, బీజేపీ నుంచి రజిత సుధాకర్‌రెడ్డి, కస్తూరి కార్తీక్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌లో లుకలుకలు మొదలయ్యాయి. కౌన్సిలర్లు ఒక్కరు ఒక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే కౌన్సిలర్లు గుండ్లపల్లి రామానుజం, జాగీరు శైలు, రెడ్డినాయక్, కుడిక్యాల రవి, వేముల రవి కాంగ్రెస్‌లో చేరారు. మరికొంత మంది కౌన్సిలర్లు చేరికకు సిద్ధమయ్యారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు మాజీ కౌన్సిలర్లు మాజీ ఎంపీటీసీ చల్ల హరికృష్ణ, సుంకరి సాయికుమార్, వేణుగోపాల్, నీరటి శ్యాం, అనిల్ కాంగ్రెస్‌లో చేరారు. పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణతో పాటు మరికొందరు పార్టీలో చేరారు. వీర్నపల్లిలో బీఎస్పీ జిల్లా నాయకులు హరిలాల్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భూక్య మదన్, తంగళ్లపల్లి మండలంలో బీఆర్ఎస్ నుంచి జడ్పీటీసీ పూర్మాణి మంజుల, చీర్లవంచ, చిన్నలాంగాపూర్ ఎంపీటీసీలు నలువాల రేణుక, భైరినేని రాము, నేరెళ్ల సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మంజుల, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. వేములవాడలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుల్కం రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు బింగి మహేష్, వంగల దివ్య, ఇప్పపూల అజయ్, ముప్పిడి సునంద, గూడూరి లక్ష్మీ, బీజేపీ నుంచి తిరుమలరెడ్డి కవిత, అన్నారం ఉమారాణి, కో ఆప్షన్ సభ్యులు శ్రీలక్ష్మీ, బాబున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహ్మద్, సింగిల్ విండో డైరెక్టర్ తోట రాజు, మాజీ కౌన్సిలర్ లావణ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, తెలుగుదేశం నాయకులు రాంబాబుగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. వేములవాడ అర్బన్ నుంచి నాంపల్లి సింగిల్ విండో చైర్మన్ భీంరెడ్డి సల్మాన్‌రెడ్డి, చీర్లవంచ ఎంపీటీసీ వనపర్తి దేవరాజు, సింగిల్ విండో డైరెక్టర్లు నాగరాజు,



మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గంభీరావుపేట సర్పంచ్ శ్రీధర్ (ఫైల్)

చిలువేరి సత్తయ్య చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందే బీజేపీ నుంచి వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం బీఆర్ఎస్‌లో చేరారు. కోనరావుపేట నుంచి కొలనూర్ మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్, కొండాపూర్ ఎంపీటీసీ పల్లె మంజు, పల్లిమక్త మాజీ సర్పంచ్ అంజయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇదే వరుసలో బోయినపల్లిలో ఎంపీటీసీలు అక్కనపల్లి ఉపేందర్, కొనకటి శిరిష, జగ్గారావుపల్లి మాజీ సర్పంచ్ సౌందర్య కాంగ్రెస్ చేరారు.

పార్టీకి దూరంగా..

కాంగ్రెస్ అధికారంలోకి రావడం, బీఆర్ఎస్ నేతలపై ఉన్న అసంతృప్తితో శ్రేణులు బీఆర్ఎస్‌కు దూరంగానే ఉంటున్నారు. సమావేశాలకు హాజరు కావడం లేదు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు కూడా బీఆర్ఎస్ పార్టీని వీడనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల కౌన్సిలర్లను బుజ్జగిస్తూ టూర్లు కూడా తిప్పారు. వీరితోపాటు బీఆర్ఎస్‌లో కీలకంగా పనిచేసిన పలువురు నాయకులకు సరైన గౌరవం దక్కడం లేదని కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతలు వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల తరువాత సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనే చురుకుగా పనిచేస్తే స్థానిక సంస్థల్లో అవకాశం ఉంటుందని భావించి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ వైపు సక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి



బహుమతులను అందజేస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, మార్చి 22: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, పాఠశాలల్లో నిర్వహించే క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని భాగ్యరేఖ ఆధ్వర్యంలో పాఠశాలల క్యాచ్‌మెంట్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీధర్, ఎంఈవో రఘుపతి, ఉపాధ్యాయులు సలావుద్దీన్, కీర్తి, లచ్చయ్య, పరమేష్, రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాసరావు, భారతి, వెంకన్న, సువర్ణ, రజిత, హరిప్రసాద్, వేణు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టును పరిశీలించిన నాబార్డు బృందం



ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న డీజీఎం

తంగళ్లపల్లి, మార్చి 22: హైడ్రోపోనిక్స్ ప్రాజెక్టును నాబార్డు బృందం పరిశీలించింది. శుక్రవారం మండలంలోని జిల్లెల్ల శివారు బాబు జగ్జీవన్ రావు వ్యవసాయ కళాశాలలో నాబార్డు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన హైడ్రోపోనిక్స్ ప్రాజెక్టును నాబార్డు డీజీఎం స్వాతి తివారి బృందం పరిశీలించింది. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం జయప్రకాష్, కరీంనగర్ క్లస్టర్ డీడీఎం మనోహర్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లు భవ్య, సంతోష్ తదితరులు ఉన్నారు.

ముత్యాల పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, మార్చి 22: మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయంలోని హుండీని లెక్కించారు. ఆలయ ప్రాంగంలో శుక్రవారం ఆరు నెలలుగా ఉన్న హుండీ లెక్కింపులో రూ.6 లక్షల 64 వేల 130 నగదు, 18 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి లభించినట్లు ఆలయకమిటీ సభ్యులు, అధికారులుతెలిపారు.

స్కూల్ యూనిఫాం ఉత్పత్తికి ముందుకు రావాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 22: సమగ్ర శిక్ష డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన చెక్ షర్ట్ యూనిఫాం క్లాత్‌ను రాపియర్ మరమగ్గాలపై ఉత్పత్తి చేసేందుకు ఆసక్తి గల కార్మికులు టెక్స్‌టైల్ పార్కులోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో సంప్రదించాలని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. టెక్స్‌టైల్ పార్కులో స్కూల్ యూనిఫాం షర్ట్ క్లాత్‌కు ఆర్డర్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మీటరుకు రూ.4.25 పైసలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

సిరిసిల్ల క్రైం, మార్చి 22: సిరిసిల్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ శుక్రవారం ముగిసింది. సిరిసిల్ల బార్ అసోసియేషన్ హాలులో ఈనెల 28న పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణరావు ఏర్పాట్లు చేస్తున్నారు. అధ్యక్ష స్థానానికి త్రిముఖ పోటీ నెలకొంది. నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం అధ్యక్ష స్థానానికి డి. సంజీవరెడ్డి, జె. శ్రీనివాసరావు, ఎస్. వసంతం పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి టి. వెంకటి, వి. గోవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి స్థానానికి బి.నాగరాజు గౌడ్, పసునూరి మధు, కోశాధికారి స్థానానికి బిట్ల విష్ణు, చీకట్ల వెంకటయ్య, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శికి గుడ్ల కిషన్, మొగిలి రాజు, గ్రంథాలయ కార్యదర్శి స్థానానికి ఎ.సురేశ్‌గౌ ప్రసాద్, జి.శశాంకం పోటీ పడుతున్నారు. అధ్యక్ష స్థానం తప్ప మిగతా అన్ని స్థానాలకు ద్విముఖ పోటీ నెలకొంది. సిరిసిల్ల బార్‌లో దాదాపు 135మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 22: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పుట్టి రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు లింగాల సందీప్ శుక్రవారం పరామర్శించారు. 25 కిలోల బియ్యం అందించారు. రవి పిల్లల చదువు కోసం సహాయ సహకారాలను అందిస్తానన్నారు. రాములు, రాహుల్, సాయిచంద్, ఉదయ్, రాకేష్, సురేష్, దేవేందర్ ఉన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మార్చి 22: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులు అనేక రకాలుగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత వారికే చెల్లిందన్నారు. రూ.6 లక్షల కోట్ల అప్పు ఉన్నా సంక్షేమ పథకాల అమలుకు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదన్నారు. మహిళాలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, గృహ జ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు వంటివి నిదర్శనమన్నారు. రైతు భరోసాపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు ఐదు ఎకరాలోపు ఉన్న రైతులకు రైతుభరోసా ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం ఏప్రిల్ నాటికి రైతుబంధు ఇచ్చిందని, కాని ప్రస్తుత ప్రభుత్వం మార్చిలోనే రైతు భరోసా ఇస్తోందని అన్నారు. గతంలో రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, మళ్లీ ప్రజాపాలనలో 200యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను ఏమాత్రమూ పట్టించుకోలేదన్నారు. నేడు మేనిఫెస్టోలో చెప్పినట్టుగా గల్ఫ్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందిన బాధిత కుటుంబలకు మర్రిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో రూ.5లక్షల పరిహారం అందజేశామన్నారు. ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని కసీఆర్ ఆరు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుందని పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వారు డబ్బుతో గెలవాలని చూస్తున్నారన్నారు. మొన్నటి రోజున ప్రతిమ మల్టీప్లెక్స్‌లో రూ.6 కోట్ల 67 లక్షలు దొరికాయన్నారు. ఆ డబ్బు తనది కాదని, తన బంధువులది కాదని ప్రమాణం చేసే దమ్ము వినోద్ కుమార్‌కి ఉందా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలుస్తుందని సర్వేలు చెబుతుండడంతో జీర్ణించుకోలేకపోతున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్న డబ్బుతో ఓట్లు కొనాలని చూస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తోడ్పాటు అందిస్తారన్నారు. నర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దొబ్బల శంకర్, అనారోగ్యంతో మృతి చెందిన పాకనాటి చంద్రయ్య కుటుంబ సభ్యులను ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు ఎర్రం శ్రీమన్నారాయణ, ఇల్లంతకుంట గణేష్, మ్యాకల గణేష్, సంటి ఎసుదాసు, శ్రీనివాసరెడ్డి, గంగధర్, జలపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్, మార్చి 22 : కుమ్మరుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముస్తాబాద్ పట్టణ శాలివాహన సంఘం సభ్యులు ఏదునూరి గోపి, ఐలపురం సంజీవ్, ఏదునూరి భాను, ఐలపురం రజ, రాజు, యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. శాలివాహన చక్రవర్తి శేషుని అనుగ్రహంతో అయోధ్యలో కుమ్మరి ఇంట్లో జన్మించారన్నారు. శాలివాహన చక్రవర్తి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. 1076 జీవోను అమలు చేయాలన్నారు. చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. శాలి వాహన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సిరిసిల్ల టౌన్, మార్చి 22: కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుమన్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలకు నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బార్న్ డిసీజెస్ కంట్రోల్(ఎన్‌సీవీబీడీసీ)కార్యక్రమంలో భాగంగా కీటక జనిత వ్యాధుల నివారణపై ఒక్కరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములు మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా ఫైలేరియా, ఎంఏఆర్ఐవైయా, జపానీస్ ఇన్‌సఫిలిటీస్ వ్యాధులను అరికట్టాలన్నారు. అనంతరం వ్యాధుల నివారణపై ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో డాక్టర్ రజిత, డాక్టర్ నాయిమ్‌జాన్, సిబ్బంది లింగం, మోహన్, రాజ్‌కుమార్, బాలయ్య, భూమయ్య, సోనీ మనీ పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీవో

తంగళ్లపల్లి, మార్చి 22: వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో వీర బుచ్చయ్య ఆదేశించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ నెల 31లోగా ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలని, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. తడి, పొడి చెత్త సేకరించాలని, కంపోస్ట్ షెడ్డుకు తరలించి డీ కంపోస్టుగా మార్చి ఎరువు తయారు చేయాలని సూచించారు. ఎరువుతో గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలంలో ప్రతి ఇంటికీ నీటి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నీటి సమస్య తలెత్తితే 24 గంటలలో పరిష్కరించాలన్నారు. వృత్తి వ్యాపార లైసెన్సులు లేని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జోగం రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం



శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం

- శిథిలావస్థలో పక్కా భవనం

కోనరావుపేట, మార్చి 22: కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పగిలి సిమెంట్ మొక్కలు కింద పడుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనకు గురైన గ్రామపంచాయతీ పాలనకు ఓ అద్దె భవనాన్ని తీసుకొని విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరు కాకపోవడంతో చేసేది ఏమీ లేక అద్దె భవనంలోనే కార్యకలాపాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

ధర్మారంలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బైక్‌పై కూర్చున్న వ్యక్తిని మరో వాహన దారుడు ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో పనిచేస్తున్న వలస కూలి రాంబాబు ధర్మారం గ్రామంలోని ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్నాడు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

బ్రహ్మోత్సవాలకు పెరిగిన రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు - రాత్రి స్వామి వారల సేవ ఊరేగింపు


పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న స్వామి వారల సేవలు

ధర్మపురి, మార్చి 22: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, అ నుబంధ ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న కట్న కానుకలు, అమ్మ వారలకు ఒడి బియ్యం సమర్పించారు. కోడె మొక్కులు, వల్లు బండ వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం పక్షాన దాతల సహకారంతో సుమారు 7 వేల మంది భక్తులకు అన్న దానం చేశారు. ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగశం కరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, గునిశెట్టి రవీందర్, సత్తయ్య, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

సర్వ దేవతా హోమం..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు సర్వ దేవతా, శాంతి హోమాలు నిర్వహించారు.

స్వామి వారల సేవ ఊరేగింపు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహస్వామి వారల సేవలను ఆశ్వ వాహనంపై ఊరేగించారు.


మొక్కులు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభంవద్దకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి దర్శనం చేసుకున్నారు. తిరిగి స్వామి వారల సేవలను ఆలయానికి తీసుక వెళ్లారు. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రెండో రూ 4,16,455 ఆదాయం లభించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,29,216, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,23,000 లభించగా, అన్న దానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 64,439 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి ఉషాగాయత్రి కూచిపూడి నృత్యప్రదర్శన ఉంటుందని, రాత్రి 7-30 గంటల నుంచి భక్తి సంగీత విభావరి, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని ఈవో తెలిపారు.


ధర్మపురి గోదావరి నది వద్ద భక్తుల సందడి

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి


ధర్మపురి శేషప్ప కళావేదికపై కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళా వేదికపై శుక్రవారం రాత్రి కళాకారులచే నిర్వహించిన భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులు జి శంకర్‌శర్మ, ఎస్ రామకిష్టయ్య, కె విశ్వనాథం, పి చంద్రమౌళి, జె నర్సయ్య, కె. శంకర్, కె దత్తాత్రి పాడిన భక్తి సంగీత పాటలు ఆకట్టుకున్నాయి. అలాగే గర్షకుర్తికి చెందిన శశికళ, రాజమల్లయ్య బృందంచే భక్తి సంగీత విభావరి, మంచిర్యాల నందిని నృత్యాలయంచే కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. హైదరాబాద్ సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం ప్రతిమ శశిధర్‌చే భక్తి సంగీత విభావరి అలరించింది. కళాకారులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి సన్మానించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జిగా ఎస్ఎల్ఎన్ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి, పక్క వాద్య కళాకారులుగా రామయ్యశర్మ (కీబోర్డు), ఎస్ వేణుగోపాల్ (మృదంగం), రమేశ్ (తబలా), శ్రీధర్ (కీబోర్డు), రాజేశం (మృదంగం, తబలా, మోర్‌సింగ్), సుదర్శనా చార్యులు (మృదంగం), రవీందర్ (ఫ్లూట్), సంతోష్ (మృదంగం), ప్రవీణ్ (కీబోర్డు), అరుణ్ (తబల) వ్యవహరించారు.

మహిళ దారుణ హత్య

● రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో ఘటన


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల క్రైం, మార్చి 22: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో మహిళ దారుణ హత్యకు గురైంది. శుక్రవారం వెలుగు చూసిన ఘటన వివరాలను సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఆరుగురు కార్మికులు సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మూడు రోజులుగా ఆ ఇంటి తలుపులు తెరవడం లేదు. గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి తాళం పగలగొట్టి చూడగా రక్తపు మడుగులో మహిళ మృతదేహం పడి ఉంది. తల వెనుక భాగంలో పదునైన ఆయుదంతో దాడి చేశారు. మృతదేహాన్ని పరిశీలించి న పోలీ సులు వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన అలకుంట రమ (41)గా గుర్తించారు. కొడుముంజకు చెందిన రమ భర్త రాజయ్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. భవన నిర్మాణ పనుల కోసం ప్రతీ రోజు కొడుముంజ నుంచి సిరిసిల్ల లేబర్ అడ్డాకు వచ్చి కూలీ పనికి వెళ్తుంది. ఇదే క్రమంలో బీహార్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడినట్లు, వారితో పనికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అద్దె ఇంటికి తీసుకెళ్లిన కార్మికులు మద్యం తాగి ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించగా ఎదురు తిరగడంతో హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల శుక్రవారం కొనసాగింది. యాసంగి పంట సాగునీటి కో సం ఎస్సారెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 18.715 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 5,396 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇందులో కాకతీయ కాలువకు 3,500, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అల్లిసాగర్ ఎత్తిపోతల పథకా నికి 347 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 146 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

క్రీడలతో స్నేహ సంబంధాలు

మానకొండూర్, మార్చి 22: క్రీడలు యువత మధ్య స్నేహ సంబంధాలు పెంచుతాయని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ 17వ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బొట్ల కిషన్, మాజీ ఉపసర్పంచు మూగల మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు పాఖాల శంకర్, గ్రామస్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు అపహరణ

వెల్గటూర్, మార్చి 22: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ వృద్ధురాలి మెడలో నుంచి దుండగుడు పుస్తెల తాడు అపహరించిన సంఘటన కలకలం రేపింది. బాధితురాలు గుమ్ముల నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటికి వెళ్లింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని పుస్తెల తాడు అపహరించడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనతో తేరుకున్న వృద్ధురాలు ఆ దుండగుడితో కాసేపు పెనుగులాడింది. ఈ క్రమంలో పెస్తెల తాడు తెగిపో యింది. రెండు తులాల పుస్తెల తాడు లాక్కొని దుండగుడు పరార య్యాడు. తెల్లవారు జాము కావడంతో ఎవరూ బయట లేకపోవడంతో అరిచినప్పటికీ లాభం లేకపోయింది. ముఖానికి దస్తీ కట్టుకోవడం దానికి తోడు చీకటిగా ఉండడంతో దుండగుని ముఖం గుర్తించలేదని వృద్ధురాలు రోదిస్తూ చెప్పింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఉమాసాగర్ డాగ్ స్క్వాడ్ బృందంతో గాలింపు చేపట్టారు.


గాలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ టౌన్, మార్చి 22: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కార్ఖానగడ్డ)లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబురాథోడ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) సభ్యులు జయశ్రీ, ఫోరం జిల్లా అధ్యక్షుడు జీవన్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వస్తువులు, ఉత్పత్తులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీ వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీఐఎస్ అవగాహనపై పరీక్ష నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి విజేతలకు 1000,750,500,250 రూపాయల నగదు బహుమతు లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ సత్యనారాయణ చారి, ఉపాధ్యాయురాలు త్రివేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి

మానకొండూర్, మార్చి 22: మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో పంది జగన్(55) అనే రైతు శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పంది జగన్ అనే రైతు తన రెండు ఎకరాల పొలంలో ఆడ మగ వరి పంటను సాగు చేస్తున్నాడు. రెండు మూడు రోజులుగా తన పొలంలో వరిని దులుపుతున్నాడు. అందులో బాగంగా శుక్రవారం కటుంబ సభ్యులతో దులుపుతుండగా అస్వస్థతకు గురి అయ్యాడు. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వడదెబ్బతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు


జగన్(ఫైల్)

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి22: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి 30రోజుల పాటు ఫొటో గ్రఫీ అండ్ వీడియో, ఏప్రిల్ 18నుంచి సీసీటీవీ ఇనస్టాలేషన్ అండ్ సర్వీసింగ్‌లో పురుషులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ తెలిపారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జగిత్యాల టౌన్, మార్చి 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతంలో ఉన్న ఓ ఇంటిలో చోరీ జరిగింది. బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన రాజేశం రెండు రోజుల క్రితం ఎండపెల్లి మండల కేంద్రానికి కుటుంబంతో వెళ్లారు. గురువారం రాత్రి ఇంటికి తిరిగి చేరుకున్న రాజేశం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ అయినట్లు గుర్తించారు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారంతో పాటు రూ. 10 వేల నగదును అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కమాన్‌పూర్, మార్చి 22 : మండలంలోని గుండారం గ్రామంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కాశెట్టి సతీష్(38) గుండారం గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో తెల్లవారుజామున తన స్వగ్రామానికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి మహిళ..

ఇల్లందకుంట, మార్చి 22: మండలంలోని సీతంపేట గ్రామంలో మతిస్థిమితం లేని జోరుక రమ (40) అనే మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమకు మూడు నెలలుగా మతి స్థిమితం కోల్పోయింది. గురువారం తన సొంత గ్రామమైన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామం నుంచి తమ బంధువులైన సీతంపేట గ్రామానికి వచ్చి తిరిగి పర్లపల్లి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. శుక్రవారం సీతంపేట గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

డీవైడర్‌ను ఢీకొని రైతు దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన చందుపట్ల లక్ష్మారెడ్డి (45) అనే రైతు శుక్రవారం రాత్రి దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మారెడ్డి గొల్లపల్లి నుంచి తన భార్య, సమీప బంధువుతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు బైక్‌పై వస్తుండగా డీవైడర్‌ను ఢీకట్టి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే మృతిచెందాడు. లక్ష్మారెడ్డి రెండు సంవత్సరాల క్రితం విదేశాల నుంచి వచ్చి వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రేణుక, బంధువుకు గాయాలు కావడంతో స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

హుజూరాబాద్, మార్చి 22: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన గంట కుమారస్వామి (26) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారస్వామి ఆరు నెలల నుంచి మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ భార్యతో గొడవపడేవాడు. గొడవలు, మద్యం మానలేక మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో రేకుల షెడ్డు ఇనుప పైపుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఒక కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి గంట సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 22: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ మూడు రోజులు జైలుశిక్ష లేదా రూ.5,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. 10 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా మరో ఏడుగురు వ్యక్తులకు 11,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, మార్చి 22: రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన సిద్దేశ్వర్ తల్వార్ అనే వ్యక్తికి శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 3రోజుల జైలు శిక్ష విధించినట్టు పోలీసులు తెలిపారు.

ముగిసిన ఏఎస్ఐ అంత్యక్రియలు

కరీంనగర్ క్రైం/తిమ్మాపూర్, మార్చి 22 : కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న ఏఎస్ఐ గురువారం మరణించగా అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో నిర్వహించిన ఏఎస్ఐ కిషన్ అంత్యక్రియల్లో కరీంనగర్ అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్‌జైన్ పాల్గొన్నారు. కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అడిషనల్ డీసీపీ వారి కుటుంబానికి ఎళ్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి, మార్చి 22: చొప్పదండి శివారులోని కాకతీయ కాలువ డి86 డిస్ట్రిబ్యూటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కాలువకు సంబంధించిన లస్కర్ కనుకయ్య శుక్రవారం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించాడు. సంఘటన స్థలానికి ఎస్సై ఉపేంద్రచారీ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 40 ఏండ్ల వయస్సు గల మహిళ మృతదేహంగా భావిస్తున్నారు. మృతదేహం బాగా కుళ్లిన స్థితిలో ఉందని,. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మార్చి22: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడినగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. కుంటాల కొండయ్య అనేవ్యక్తి పెద్దకుమారుడు విజయ్‌కుమార్ మానసిక రుగ్మతతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈనెల 17న మోతాదుకు మించి మందులు వేసుకోగా, కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో పడి పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి, 22 : మండలంలోని వాలొండ గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు గోదావరిలో పడి పశువుల కాపరి పుట్ట గంగరాం(55) నీట మునిగి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పుట్ట గంగరాం తన కొడుకు పుట్ట సురేష్‌తో కలిసి పశువులను మేపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పశువులను మేపుకుంటూ మండలంలోని వాల్గొండ గంగ సమీపానికి వచ్చారు. అక్కడ ప్రమాదవశాత్తు గంగారాం నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. గంగారాం కొడుకు సురేష్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలం పరిశీలించి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంచాలకులు చత్రునాయక్

ఇల్లందకుంట, మార్చి 22: రైతులు తమ వ్యవసాయ పనుల్లో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిసేడు గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారిని గుర్రం రజిత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చత్రునాయక్ మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పైరుకు అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రాములు, మాస్కోజెబ్ 2.5 గ్రాములు ఐసోప్రోతయోలెన్ 2.5 గ్రాములు నీటిలో కలుపుకొని తెగులు ఉధృతిని బట్టి 10నుంచి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. అదేవిధంగా పాముపొడ తెగులు గమనించినట్లయితే హైక్సెకెనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, ప్రొపికొనిజోల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. కాండం కుళ్లు తెగులు గమనించినట్లయితే హెక్సాకోనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, కార్బండెజిమ్ 1 గ్రాము 15 రోజుల్లో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రమేష్

సిరిసిల్ల క్రైం, మార్చి 22: మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని అన్నారు. ఈ తనిఖీల్లో పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగునీటి సమస్య



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అధికార ప్రతినిధి

ఇల్లంతకుంట, మార్చి 22: బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమీషన్లకు కక్కుర్తి పడడంతోనే లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయన్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టు ద్వారా 30వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్న నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. ఈ సమావేశంలో పెద్దలింగాపూర్ ఎంపీటీసీ కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, నాయకులు బదుగు లింగం, మచ్చ రాజేశం, జెట్టి మల్లేశం, రమేష్, చంద్రమౌళి, నరేందర్‌రెడ్డి, బాబు, మల్లయ్య, కేశవులు, దాసు, అంజనేయులు, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాను



ముస్తాబాద్, మార్చి 22 : అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా మిరుదొడ్డి భాను రజక నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్‌కుమార్ రజకకు భాను కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన గ్రామస్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక అంబేద్కర్ సంఘాల నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్ సంఘాలు, గ్రామస్థులు ఏకమై విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో మంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ గ్రామాన్ని దత్తత తీసుకొని అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం మరిచారని గ్రామస్థులు ఆరోపించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

చందుర్తి, మార్చి 22: మండలంలోని సనుగుల గ్రామంలో బెల్ట్ షాపులపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పుల్లూరి గోవిందు వద్ద నుంచి రూ.7600 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మాజీ ఉప సర్పంచ్‌పై హత్యాయత్నం?

● మోటారు వద్ద కరెంట్ తీగ ఏర్పాటు ● పోలీసులకు ఫిర్యాదు

వెల్గటూర్/ఎండపల్లి, మార్చి 22: కొండాపూర్ మాజీ ఉప సర్పంచ్ వెంకటస్వామికి చెందిన పొలం వద్ద మోటారు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పడ కుండా కరెంట్ తీగను అమర్చి హత మార్చాలని చూసినట్లు అనుమానంతో శుక్రవారం వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటస్వామి తెలిపి న వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన కరెంట్ తీగను గమనించక పొలానికి నీరు పెట్టడానికి మోటారు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఎర్త్ రావడంతో అనుమానం వచ్చి వెనుదిరిగాడు. అనంతరం అక్కడ పరిశీలించగా ఏర్పడకుండా ఓ తీగను అమర్చినట్లు స్థానికులతో కలిసి గమనించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలలో కలిసేవని వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ఉమాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలు పరిశీలించారు. కరెంట్ తీగను అమర్చిన వారు ఎవరు అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

అభివృద్ధికి దూరంగా నాంపల్లి గుట్ట

వేములవాడ టౌన్, మార్చి 22: దక్షిణకాశీ వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి గుట్ట అభివృద్ధికి దూరంగా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుట్ట అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో నాంపల్లి గుట్టను సందర్శించడం ఆనవాయితీ. నాంపల్లి గుట్టపైన ఏర్పాటు చేసిన కాళీయమర్ధనం భక్తులను ఆకట్టుకుంటుంది. నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తున్న గుట్టపైన భక్తులు సేదతీరేందుకు వెసులుబాటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



నాంపల్లి గుట్టపై ప్రధాన గోపురం సమీపంలోని ఖాళీ స్థలం



తులసీ వనం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్న స్థలం

నీటి సౌకర్యం కల్పించాలి

వేసవి కాలంలో భక్తులు నాంపల్లి గుట్టపైకి ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. గుట్టపైకి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా నాంపల్లి గుట్టపైకి వచ్చిన భక్తులకు నీటి సౌకర్యం లేకపోవడంతో భక్తులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొని ఆలయాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న ఆలయంలో ఏర్పాటు చేసిన రాజన్న జల ప్రసాద కేంద్రాన్ని నాంపల్లి గుట్టపైన ఏర్పాటు చేస్తే భక్తులకు ఉపయోగ కరంగా ఉంటుందని చెబుతున్నారు.

తులసీ వనం ఏర్పాటు చేయాలి

నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రధాన గోపురం పక్కన ఉత్తరంవైపున ఖాళీ స్థలంలో తులసీ వనం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. లక్ష్మీనర్సింహస్వామి ప్రధాన గోపురం పక్కన తులసీవనం ఏర్పాటు చేయాలని అర్చకులు, భక్తులు కోరుతున్నారు.

స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాంపల్లి గుట్టపైన ప్రధాన గోపురం ఉత్తరం వైపున వున్న ఖాళీ స్థలాన్ని ఆలయాధికారులు సద్వినియోగం చేసుకుంటే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు కోరుతున్నారు. ఆలయం చుట్టూ నల్లటి బండతో నిండిఉండడంతో భక్తుల సౌకర్యార్థం షెడ్లు ఏర్పాటు చేసేందుకు గానీ, పూలవనం నాటేందుకు వీలు లేకుండా పోయింది. అయితే ఆలయ ప్రధాన గోపురానికి ఉత్తరం వైపున నాలుగు అడుగులు కిందకి మెట్లు ఏర్పాటు చేసి కిందకు దిగితే రెండు నుంచి మూడు గుంటల ఖాళీ స్థలం ఉందని దాన్ని వ్యూ పాయింట్‌గా తీర్చిదిద్దాలని అభిప్రాయపడుతున్నారు.

గుట్టపై భక్తుల ఇబ్బందులు



- బొల్లు తిరుపతి, నాంపల్లి

భక్తులు కొండపైన మెట్లు ఎక్కి పైకి రావాలి. గుట్టపైకి వచ్చిన భక్తులు సేదతీరేందుకు వెసులు బాటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాంపల్లి గుట్టపైన ఉన్న ఖాళీ స్థలాన్ని అధికారులు సద్వినియోగం చేసుకోవాలి. భక్తులు సేదతీరేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలి. వ్యూ పాయింట్ ఏర్పాటు చేస్తే ఆకర్షణీయంగా ఉంటుంది.

తులసీ వనం ఏర్పాటుకు హామీ



- రామాచారి, ప్రధాన అర్చకులు, నాంపల్లి

నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామివారి ఆలయ సమీపంలో తప్పనిసరిగా తులసీ వనం ఉండాలి. స్వామివారి ప్రధాన గోపురం ఈశన్యం వైపున వైష్ణవ క్షేత్రంలో తులసి వనం ఏర్పాటు చేయాలి. ఇప్పటికే నాంపల్లి ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు సానుకూలంగా స్పందించారు. త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈఈవో, రాజన్న ఆలయం

నాంపల్లి గుట్టను అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈవో నాంపల్లి గుట్టపైకి వచ్చిన సమయంలో తులసీవనం ఏర్పాటు చేయాలని, ఖాళీ స్థలంలో భక్తులు విడిది చేసేందుకు ఖాళీ స్థలాన్ని క్షేత్రస్థాయిలో చూపించాం. త్వరలోనే ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతాం.

ముదిరాజ్‌లు రాజకీయాల్లో రాణించాలి



మండపం ప్రారంభోత్సవంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నేతలు

గంభీరావుపేట, మార్చి 21 : ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండాలని, రాజకీయాల్లో క్రియా శీలక పాత్ర పోషించాలని ముదిరాజ్ సంఘం నేతలు పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దండవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రధానంగా ముదిరాజ్ బిడ్డలు విద్యను అభ్యసించేందుకు తల్లిదండ్రులు ముందుండాలని, అప్పుడే రాజకీయాలను శాసించే స్థాయికి ఎదుగుతారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సీట్లను కేటాయించాలన్నారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాణవేణి లక్ష్మణ్, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పిట్ల బాబు, ఉపాధ్యక్షుడు మచ్చ ఆనందం, పిట్ల నర్సయ్య, రాష్ట్ర నాయకులు పిటల భూమేష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడు వీరబోయిన రమేష్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గాడిచర్ల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు ఈరబోయిన సంజీవ్, మండల కోశాధికారి తోక దేవదాసు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

● కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ శివయ్య, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, నాయకులు గంధ్యాడపు రాజు, ఎగదండి స్వామి హాజరయ్యారు.

నిరుపయోగంగా చేతి పంపు



ఆలయం ఎదుట పని చేయని చేతిపంపు

రుద్రంగి, మార్చి 22 చేతి పంపులు మరమ్మతు చేయక పోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. రుద్రంగి మండల కేంద్రం శివారులోని గండి వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట చేతి పంపు పాడైపోవడంతో నిరుప యోగంగా మారింది. ఆలయం చుట్టు పక్కల ఉన్న రైతులు తాగు నీటి కోసం ఆ చేతి పంపును ఉపయోగించుకునే వారు. రుద్రంగి, చందుర్తి మండలాల శివారుల్లో గండి వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండు మండలాల ప్రజలు నిత్యం వస్తుంటారు. కొద్ది రోజులుగా చేతి పంపు పని చేయకపోవడంతో వేసవిలో అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం రైతులు, ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

బోరు మోటారు, ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి

గండి వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట నీటి కోసం ఇబ్బందులు లేకుండా ఉండాలంటే చేతి పంపును తొలగించి బోరు మోటారు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దీంతోపాటు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు

మానకొండూర్, మార్చి 22 : ఆయిల్‌పామ్ పంటల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇండోనేషియా శాస్త్రవేత్త విజయన్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం తెలంగాణ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉన్న డెలి, లామే రకం వృద్ధి చేయబడి లోహియా కంపెనీ ఆధ్వర్యంలో దేశంలోని రైతులకు దిగుమతి చేయడం జరుగుతుందన్నారు. ఈ రకం మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకోవడమే కాకుండా అధిక దిగుబడినిచ్చే మేలు రకం పొట్టి విత్తనం అన్నారు. ప్రతి మూడు నుంచి నాలుగు నెలలకొకసారి సిరాడ్ పామ్ ఎలిట్ బృందం పంటలను పరిశీలించడం జరుగుతుందన్నారు. గత 30 ఏళ్లుగా దేశంలో గోల్డ్ డ్రాప్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజులలో రైతులందరికీ ఉత్తమ సేవలు అందిస్తూ పంటను తామే కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో సిద్ధాంత్ లోహియా, స్థానిక ఎఫ్‌పివో చైర్మన్ పాఖాల పురుషోత్తంరెడ్డి, కంపెనీ సాంకేతిక సలహాదారు వైఎస్ రంగనాయకులు, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, కేవికే జమ్మికుంట శాస్త్రవేత్త వేణుగోపాల్, జిల్లా రీజినల్ మేనేజర్ విజయ్ భరత్, సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- లోక్ సభ ఎన్నికల విధివిధానాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మార్చి 22: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతీ ఒక్కరు బాధ్యతతో పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో లోక్ సభ ఎన్నికల విధివిధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్‌కు లోబడి ప్రతీ ఒక్కరు పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైందన్నారు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా సాగేలా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజున, ఆ తర్వాత, ముందు రోజు విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. గత ఎన్నికలలో నేర చరిత్ర ఉన్నవారు, రౌడీ షీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేయాలన్నారు. జాబితా ప్రకారం కౌన్సెలింగ్ ఇవ్వాలని, సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రలోభ పరిచేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరించాలన్నారు. మద్యం, నగదు పంపిణీలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై స్పష్టత ఉండాలన్నారు. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లోఆ గుడ్ ప్రాక్టీస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



హాజరైన పోలీసు అధికారులు

మాతాశిశు సంరక్షణే లక్ష్యం



కోనరావుపేటలో పోషణ్ అభియాన్ కార్యక్రమం

వీర్నపల్లి, మార్చి 22 : మాతాశిశువు సంరక్షణే లక్ష్యంగా ఐసీడీఎస్ పని చేస్తోందని సూపర్ వైజర్ రేణుక అన్నారు. వీర్నపల్లి మండలం శాంతినగర్, వన్‌పల్లి, మద్దిమల్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై ఐసీడీఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. వివిధ శాఖల సమన్వయంతో పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల నమోదుతోపాటు పరీక్షలు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణీలకు, బాలింతలకు పోషక విలువలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గంగా లక్ష్మి, దేవిక, రమ్య, సరిత, నర్మదా, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో చేరికలు

సిరిసిల్ల టౌన్, మార్చి 22 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో కౌన్సిలర్లు పార్టీలో చేరుతున్నారని సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో 7వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ భూక్య రెడ్డినాయక్, 21వార్డులో కౌన్సిలర్ వేముల రవి, 25వార్డులో కౌన్సిలర్ కుడ్యికాల రవికుమార్ వేర్వేరుగా అనుచర వర్గంతో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా పని చేసినా సిరిసిల్ల పట్టణంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. బంగారు తెలంగాణ అంటూ ఉపన్యాసాలు ఇచ్చారని, వర్షాలు పడి వరదలతో సగం సిరిసిల్ల కొట్టుకుపోతుంటే పట్టించుకోలేదని ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని చేపట్టాలని, సమస్యలను పరిష్కరించాలని అప్పటి మంత్రి కేటీఆర్‌ను కోరినా సోయిలేదని ఆరోపించారు. బతుకమ్మ చీరల బకాయిలు రూ.250 కోట్లు, రెండు సంవత్సరాల విద్యుత్ సబ్సిడీ రూ.20 కోట్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనతో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాంపరింగ్‌కు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందు కోసం సిరిసిల్లలో ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశారని ఆరోపించారు. కవితమ్మ గల్లీలో దోచుకున్నది చాలదని, ఢిల్లీ లిక్కర్ స్కాంలో చేరి కేజ్రీవాల్‌కు అంటించిందన్నారు. చట్టం ఎవరి చుట్టమూ కాదని, తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. తెలంగాణ ప్రజలను క్షోభకు గురి చేసిన వారిపై తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్ల లక్ష్మీనారాయణ, రాగుల జగన్, మడుపు శ్రీదేవి, నాయకులు వెల్మల తిరుపతిరెడ్డి, భీమవరపు శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, బూట్ల నవీన్, గుండ్లపల్లి గౌతమ్, కత్తెర దేవదాస్ పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న కౌన్సిలర్ రెడ్డినాయక్

బొప్ప దేవయ్య ఆధ్వర్యంలో..

సిరిసిల్ల పట్టణం ఏడవ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ భూక్య రెడ్యానాయక్, వార్డు నాయకులు కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువాలు వేసి వారందరిని పార్టీలోకి కేకే మహేందర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, నాయకులు గడ్డం నర్సయ్య యెల్లె లక్ష్మీనారాయణ, దేవదాస్, వెంకటరమణ పాల్గొన్నారు.